నమస్తే తెలంగాణ నిజామాబాద్, శనివారం 4 మే 2024 SATURDAY, MAY 4, 2024

డిగ్రీ వన్‌టైమ్ ఛాన్స్ ఫీజు గడువు పొడిగింపు

డిచ్‌పల్లి, మే 3 : టీయూ పరిధిలోని 2011 నుంచి 2016 వరకు డిగ్రీ (వైడబ్ల్యూఎస్) అనుత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వన్‌టైమ్ ఛాన్స్ కోసం ఫీజు చెల్లించే గడువును పొడిగించినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎం. అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఏ (ఎల్) కోర్సులకు 1, 2, 3వ సంవత్సరపు బ్యాక్‌లాగ్ పరీక్షలకు, 2016 నుంచి 2019 వరకు డిగ్రీ (సీబీసీఎస్) కోర్సులకు సంబంధించి 1, 2, 3, 4, 5, 6వ సెమిస్టర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు వన్‌టైమ్ ఛాన్స్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. జూన్, జూలైలో పరీక్షలు ఉంటాయని తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లింపు గడువు ఈనెల 2 వరకు ఉండగా.. ఈనెల 9వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. 100 రూపాయల అపరాధ రుసుముతో ఈనెల 10వ తేదీ వరకు చెల్లించవచ్చని వెల్లడించారు.

అగ్నిప్రమాదాల నివారణపై సిబ్బందికి అవగాహన

ఇందల్వాయి, మే 3 : మండల కేంద్రంలోని టోల్‌ప్లాజా సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా మేనేజర్ వీరబాబు, సిబ్బంది సంతోష్, అగ్నిమాపక సిబ్బంది అయ్యూబ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

బాసర అమ్మవారికి వెండి తోరణం

- ఆలయ కమిటీకి అందజేసిన చందూర్ వాసి జగ్గారి శేఖర్‌రెడ్డి

వెండి తోరణాన్ని అందజేస్తున్న జగ్గారి శేఖర్‌రెడ్డి

చందూర్, మే 3 : బాసర సరస్వతీ అమ్మవారికి చందూర్ గ్రామానికి చెందిన జగ్గారి శేఖర్‌రెడ్డి కుటుంబీకులు కిలో వెండితో చేయించిన తోరణాన్ని బహూకరించారు. తోరణాన్ని ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఆలయ అర్చకులు వారికి ఆశీర్వాదాలు, అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

రుద్రూర్‌లో ఓట్ ఫ్రం హోం వినియోగించుకున్న 31 మంది

రుద్రూర్, మే 3 : మండలంలోని పలువురు వృద్ధులు, దివ్యాంగులు శుక్రవారం ఓట్ ఫ్రం హోంను వినియోగించుకున్నారు. రుద్రూర్, అక్బర్‌నగర్, అంబం గ్రామాల్లో పోలింగ్ అధికారులు బృందాలుగా ఏర్పడి ఓట్ ఫ్రం హోం కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్ల వద్దకు వెళ్లగా, ఎన్నికల నిబంధనల ప్రకారం అర్హులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలవ్యాప్తంగా 32 మంది వృద్ధులు, దివ్యాంగులు దరఖాస్తు చేసుకోగా.. 31 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు.

సీఆర్పీఎఫ్ బలగాల కవాతు

గన్నారంలో కవాతు నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ బలగాలు

ఇందల్వాయి, మే 3 : మండలంలోని గన్నారంలో సీఆర్పీఎఫ్ బలగాలు శుక్రవారం కవాతు నిర్వహించాయి. పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులందరూ ఎలాంటి భయాందోళన చెందకుండా, స్వచ్ఛందంగా, స్వతంత్రంగా ఓటు హక్కు వినియోగించాలని తెలిపేందుకు కవాతు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. సీపీ కల్మేశ్వర్, ఏసీపీ శ్రీరాజ ఆదేశాల మేరకు కవాతు నిర్వహించారని ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి ఎస్సై మహేశ్, సిబ్బంది, సీఆర్పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

'మతరాజకీయం వద్దు.. ప్రజాస్వామ్యమే ముద్దు'

కంఠేశ్వర్, మే 3 : బీజేపీ బందీఖానా నుంచి దేశానికి విముక్తి ఇద్దామని.. మతరాజ్యంవద్దు–ప్రజాస్వామ్యమే ముద్దు అని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు అన్నారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుక్‌లెట్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని కాపాడేందుకు బీజేపీకి ఓటుతో బుద్ధిచెప్పాలన్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు పెద్ది వెంకట్‌రాములు, నూర్జహాన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో వ్యక్తి హంగామా..

శక్కర్‌నగర్, మే 3: మద్యం మత్తులో ఓ వ్యక్తి గురువారం రాత్రి బోధన్ పోలీస్ స్టేషన్‌లో వీరంగం సృష్టించాడు. అడ్డువచ్చిన ప్రతి ఒక్కరినీ దుర్భాషలాడుతూ.. పోలీస్ స్టేషన్‌లోని అద్దాలను ధ్వంసం చేశాడు. బోధన్ పట్టణానికి చెందిన అబ్బూ అలియాస్ షేక్ అబ్దుల్లా రాత్రి సుమారు రెండు గంటల పాటు హంగామా చేశాడు. మద్యం మత్తులో ఉండడంతో పోలీసులు ఆయనను బోధన్ దవాఖానకు తమ వాహనంలో తరలించారు. అక్కడ కూడా వీరంగం సృష్టించాడు. పోలీసులు అదుపులోకి తీసుకుని దవాఖానలో చేర్పించారు. మద్యం మత్తు దిగిన అనంతరం అదుపులోకి తీసుకున్నారు. అబ్బూ అలియాస్ షేక్ అబ్దుల్ రౌడీషీటర్ అని, ఆయనపై గతంలో పలు కేసులు నమోదై ఉన్నాయని పట్టణ సీఐ వీరయ్య శుక్రవారం తెలిపారు. కేసు నమోదు చేసి అబ్బూను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

బాల్కొండ, మే 3 : బాల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోదేపల్లి గ్రామానికి చెందిన రోండ్ల అనిల్ (27) శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై శంకర్ తెలిపారు. ఏఎస్సై కథనం మేరకు.. అనిల్ కొన్నేండుగా మద్యానికి బానిసగా మారాడు. కిడ్నీలో రాళ్లు కావటంతో నొప్పి భరించలేక ఏప్రిల్ 26న పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుని తండ్రి పెద్ద లింగన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పీఏసీఎస్ కార్యదర్శిగా విష్ణువర్ధన్

మాక్లూర్, మే 3 : నిజామాబాద్ పీఏసీఎస్ కార్యాలయంలో సీఈవోగా విధులుగా నిర్వహిస్తున్న విష్ణువర్ధన్ బదిలీపై మాక్లూర్ పీఏసీఎస్ కార్యాలయానికి సీఈఓగా వచ్చారు. గతంలో మాక్లూర్ పీఏసీఎస్ కార్యదర్శిగా విధులు నిర్వహించిన ఆయన కొంత కాలం సెలవులో ఉంటూ ఇటీవలే నిజామాబాద్ పీఏసీఎస్ సీఈవోగా బాధ్యతలు స్వీకరించారు. తిరిగి మాక్లూర్ సీఈవోగా బాధ్యతలు స్వీకరించారు.

ఆరు గుడిసెలు దగ్ధం

మాక్లూర్, మే 3: అడవి మామిడిపల్లి గ్రామంలో గంగోని సంతోష్, ప్రణీత్, చిట్టెం గుణవంతు, చిట్టెం శంకర్, చిట్టెం శేఖర్, చిట్టెం చిన్నయ్యకు చెందిన ఆరు గుడిసెలు శుక్రవారం ప్రమాదవశాత్తు కాలిపోయాయి. వీటిలో రెండు నివాస గుడిసెలు, నాలుగు సామగ్రి నిల్వ చేసే గుడిసెలు ఉన్నాయి. వీటిలో ఉన్న రిఫ్రిజిరేటర్లు, కూలర్లు, ఫర్నిచర్ కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈప్రమాదంలో రూ.6 లక్షలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. రెవెన్యూ అధికారులు వెళ్లి పంచనామా నిర్వహించారు.

ఆరు గ్యారెంటీల పేరుతో మోసం

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్
- జిల్లాకేంద్రంలో బిగాలతో కలిసి ఎన్నికల ప్రచారం

ఖలీల్‌వాడి/ఆర్మూర్‌టౌన్, మే3: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని అన్నారు. జిల్లా కేంద్రంలోని 45వ డివిజన్‌లో అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తాతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఫ్రీ బస్సు తప్ప చేసిందేమీ లేదని, రుణమాఫీ, కల్యాణలక్ష్మి, రైతుబంధు కూడా లేకుండా పోయిందన్నారు. నీరు రాక, పంటలు ఎండి రైతులు ఇబ్బందులు పడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఎంపీ అర్వింద్ గత ఎన్నికల్లో పసుపు బోర్డు తెస్తానని హామీ ఇచ్చి, ఐదేండ్లయినా ఏమీ తేలేకపోయారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలను ప్రజలు నమ్మేపరిస్థితిలో లేరన్నారు.

ఆర్మూర్ పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారెంటీలు, 420 అబద్ధపు హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మరోసారి ప్రజలను మభ్య పెడుతోందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు.



జిల్లాకేంద్రంలో ప్రచారంలో పాల్గొన్న బాజిరెడ్డి, బిగాల.. బిగాలకు తలపాగ చుడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్ (ఇన్‌సెట్లో)

బాజిరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం

జిల్లాకేంద్రంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నందిపేటలో మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి..

ఘన్‌పూర్‌లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోచారం సురేందర్‌రెడ్డి

ఖలీల్‌వాడి/ సారంగపూర్, మే 3 : అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా సూచనల మేరకు జిల్లా కేంద్రంలోని 54 డివిజన్లలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికి వెళ్లి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్, బీజేపీ ప్రజలకు ఇచ్చి, అమలుచేయని హామీలను గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరించారు.

నిజామాబాద్ రూరల్ మండలంలోని గుండారం, తిర్మన్‌పల్లి, పాల్దా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ పనుల వద్దకు వెళ్లి కరపత్రాలతో ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి బాజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బొల్లెంక సుమలతా గోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మీసాల మధుకర్‌రావు, ఎంపీపీ బానోత్ అనూషా ప్రేమ్‌దాస్, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు తదితరులు మాజీ సర్పంచులు లక్ష్మణ్‌రావు, అశోక్, ఎంపీటీసీలు అంకల గంగాధర్, నాయకులు జమీర్ ఖాన్, ప్రభాకర్, శేఖర్ పాల్గొన్నారు. డిచ్‌పల్లి మండలంలోని నడ్పల్లి, మెంట్రాజ్‌పల్లి, సుద్దపల్లి గ్రామాల్లో బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. జడ్పీటీసీ దాసరి లక్ష్మీనర్సయ్య, నాయకులు శక్కరికొండ కృష్ణ, నల్లవెల్లి సాయిలు, పద్మారావు, నడ్పన్న, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా..

చందూర్/ కోటగిరి, మే 3 : జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. భారీ మెజార్టీతో గెలిపించాలని శుక్రవారం కోటగిరిలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింట ప్రచారం చేశారు. చందూర్ మండలంలోని ఘన్‌పూర్‌లో ఉపాధి హామీ పనులు కొనసాగుతున్న ప్రాంతంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సురేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అంబర్‌సింగ్, ప్యారం అశోక్, శ్రీమన్నారాయణ, దాసరి గంగారాం, సంజీవ్, కుర్మసాయగౌండ, కల్లూరి లాలాబోయి తదితరులు పాల్గొన్నారు.

కారు గుర్తుకు ఓటు వేయాలి

నందిపేట్, మే 3: ఖుద్వాన్‌పూర్, సిద్ధాపూర్, వన్నెల్(కె) గ్రామాల్లో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కార్తీక్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్, భరత్, ప్రవీణ్‌గౌడ్, దినేశ్, నాయకులు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో ఇంటింటికీ ప్రచారం

వేల్పూర్, మే 3: మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రేగుల రాములు, సుంకరి రాము, గుజరాతి అశోక్, బాలకృష్ణ, వేల్పుల ప్రసాద్ పాల్గొన్నారు.

ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తవద్దు

- రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేకాధికారి శరత్

కంఠేశ్వర్, మే 3: ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఏ ఒక్క నివాస ప్రాంతంలో తాగునీటి సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి శరత్ అధికారులను ఆదేశించారు. నీటి ఎద్దడి నివారణకు జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలు భేషుగ్గా ఉన్నాయని అభినందించారు. నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఆయన శుక్రవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి తాగునీటి సరఫరాపై మండల ప్రత్యేకాధికారులు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, వివిధ మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి శరత్, పక్కన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఈవీఎంల రెండో ర్యాండమైజేషన్ పూర్తి

కంఠేశ్వర్,మే 2 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంల రెండో విడుత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు నేతృత్వంలో శుక్రవారం పూర్తిచేశారు. కలెక్టరేట్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎలిస్ వజ్ ఆర్ సమక్షంలో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల ఎదుట ర్యాండమైజేషన్ నిర్వహించారు. కమిషనింగ్ ప్రక్రియ నిజామాబాద్ జిల్లాలోని 5 సెగ్మెంట్ల పరిధిలో శనివారం నుంచి, కోరుట్ల, జగిత్యాల సెగ్మెంట్‌లో ఈ నెల 5వ తేదీ నుంచి చేపడతామని తెలిపారు.

సీఎంసీలో ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎలిస్ వజ్ ఆర్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఫెసిలిటేషన్ సెంటర్ పరిశీలన

నిజామాబాద్ ఆర్డీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శుక్రవారం పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను జాగ్రత్తగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

సీఎంసీలో కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన..

డిచ్‌పల్లి, మే 3 : పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం సీఎంసీలో చేపడుతున్న ఏర్పాట్లను ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎలిస్ వజ్ ఆర్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు.. సీపీ కల్మేశ్వర్, మున్సిపల్ కమిషనర్ మకరంద్ తదితరులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు గదులు, పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను భద్రపర్చేందుకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద చేపట్టిన చేపట్టాల్సిన ఏర్పాట్లను అబ్జర్వర్లకు కలెక్టర్ వివరించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్ల వద్ద సీసీ కెమెరాలు, సిబ్బందికి మౌలిక వసతులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట ట్రైనీ కలెక్టర్ సాకేత్, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, కార్మికశాఖ అధికారి యోహాన్, మెప్మా పీడీ రాజేందర్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

బాజిరెడ్డి గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలి

మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

ఆర్మూర్‌టౌన్, మే3: మండలంలోని అంకాపూర్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి స్వగృహంలో పలు గ్రామాలకు చెందిన యువకులు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపునకు సైనికుల్లా పని చేయాలని కోరారు. సీఎం కేసీఆర్ హయాంలో అమలైన పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైందని అన్నారు.

మొక్కలకు నీరు పోయించిన అధికారులు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

మొక్కలకు నీరు పోస్తున్న కార్మికులు

ఆర్మూర్‌టౌన్, మే3: 'మినీ ట్యాంక్‌బండ్‌ను పట్టించుకోని పాలకులు' శీర్షికన గతనెల 29న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. పట్టణంలోని మల్లెరు చెరువు కట్ట (మినీట్యాంక్‌బండ్)పై ఎండిపోతున్న మొక్కలకు శుక్రవారం మున్సిపల్ కార్మికులు ట్యాంకర్ ద్వారా నీరు పోశారు.

న్యాయమూర్తి నియామకం

శేషతల్ప సాయి

బోధన్, మే 3: బోధన్ సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ న్యాయమూర్తిగా బోధన్ పట్టణానికి చెందిన ఎ.శేషతల్పసాయి నియమితులయ్యారు. ఆయన జిల్లా సెషన్స్ న్యాయమూర్తి కుంచాల సునీత చేతుల మీదుగా శుక్రవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. ఆ వెంటనే బోధన్ న్యాయస్థానంలో బోధన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నుంచి చార్జి తీసుకుని, విధుల్లో చేరారు. శేషతల్ప సాయి జిల్లాలోని న్యాయస్థానాల్లో ఉద్యోగిగా సుదీర్ఘకాలం పాటు పనిచేసి నిజామాబాద్ ఫ్యామిలీ కోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా 2020లో ఉద్యోగ విరమణ చేశారు. శేషతల్ప సాయి అనుభవం, అర్హతలను దృష్టిలో ఉంచుకుని ఆయనను సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా న్యాయశాఖ నియమించింది.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

రెంజల్, మే 3: మండలంలోని కందకుర్తి గ్రామ సమీపంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఎస్సై సాయన్న శుక్రవారం ముమ్మరంగా వాహనాల తనిఖీ చేశారు. ఈనెల 13న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం తరలించకుండా నిఘా ఉంచినట్లు ఆయన తెలిపారు.

సాంకేతిక లోపమా? డ్రైవర్ల నిర్లక్ష్యమా?

- బోధన్ రైల్వేగేట్ వద్ద రెండు నెలల్లో రెండు ప్రమాదాలు



గురువారం రాత్రి రైల్వేగేట్‌ను ఢీకొన్న ఆర్టీసీ అద్దెబస్సు

శక్కర్‌నగర్, మే3: బోధన్ పట్టణంలోని వర్నికి వెళ్లే రహదారిలో ఉన్న రైల్వేగేట్ ప్రమాదకరంగా మారింది. రైల్వే గేట్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతోపాటు, వాహనాల డ్రైవర్లు గేట్లు పడే సమయానికి వచ్చి రైల్వే లైన్‌ను క్రాస్ చేసేందుకు ప్రయత్నంచడంతో ప్రమాదాలకు కారణంగా మారుతోంది. నెలరోజుల్లోనే రెండు సంఘటలను చోటు చేసుకున్నాయి. కొన్ని రోజులు క్రితం ఓ వైపు గేట్ ఓపెన్ ఉండగా ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ రైల్వే లైన్ దాటివెళ్లేందుకు ప్రయత్నించగా మరోగేట్ అకస్మాత్తుగా పడిపోయింది. బస్సు రైల్వే ట్రాక్‌కు సమీపంలో ఇరుక్కుపోయింది. రైలు వెళ్లేందుకు స్థలం ఉండడంతో ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో అధికారులు విచారణ జరిపినా... ఎవరిపై చర్యలు తీసుకున్నారనేది ఇప్పటికీ తేలలేదు. కాగా, ఈనెల 2వ తేదీ రాత్రి విధులు ముగిసిన తర్వాత వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు గేటు వేసే సమయానికి వచ్చి గేట్‌రాడ్‌ను ఢీకొట్టింది. దీంతో రాడ్‌వంగిపో ట్రాక్‌పైకి వెళ్లింది. కరీంనగర్ డెమో రైలు రావడంతో అప్రమత్తమైన గేట్‌మన్ రైలును గాంధీపార్క్ వద్ద ఆపివేయించి, స్థానికుల సహకారంతో గేట్‌ను పట్టాలపై నుంచి తప్పించారు. అనంతరం రైలు రాకాసిపేట్ రైల్వేస్టేషన్‌కు వెళ్లింది. బస్సు ఖాళీగా ఉండడం, రైలును నిలిపివేయించడంతో ప్రమాదం తప్పింది. రైల్వేశాఖ అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అర్వింద్, జీవన్‌రెడ్డిది ఫెవికాల్ బంధం

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధికార ప్రతినిధి రాజారాం యాదవ్

ఖలీల్‌వాడి, మే 3: ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి అరింద్ మామాఅల్లుళ్లని, 2019 ఎన్నికల నుంచి వారిది ఫెవికాల్ బంధంమని బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజారాం యాదవ్ అన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్య ఉన్న అనుబంధాన్ని ఆయన వివరించారు. ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఉన్న రహస్య ఒప్పందాన్ని ప్రజలు గమనించాలన్నారు. గత ఎన్నికల అనంతరం జగిత్యాలలో నిర్వహించిన ఓ సమావేశంలో అర్వింద్ మాట్లాడుతూ.. తాను ఎంపీగా గెలిచేందుకు అంకుల్ (కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి) చాలా కష్టపడ్డారని, అంకుల్‌కు రుణపడి ఉన్నానంటూ స్వయంగా ప్రకటించారని గుర్తు చేశారు. అనుభవజ్ఞుడు, చాలా మంది రాజకీయ ఉద్దండులను ఓడించిన ఘనత ఉన్న బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించి, కాంగ్రెస్, బీజేపీల చీకటి బంధాన్ని ఎండగట్టాలని కోరారు. సమావేశంలో నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కొత్తూర్ లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి ఎనుగందుల మురళి, నాయకులు డాక్టర్ టి.శంకర్, మహిపాల్ యాదవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన రాములు

ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన నూత్‌పల్లి వాసి లోక రాములు

నందిపేట్, మే3: తాను ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించినట్లు డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామానికి చెందిన లోక రాములు శుక్రవారం తెలిపారు. ఇటీవల ఆయన మాలావత్ పూర్ణ ఆధ్వర్యంలో టీఏబీసీ అనే కంపెనీ ద్వారా 16 మంది ఎవరెస్ట్ బేస్ క్యాంప్ శిక్షణకు వెళ్లినట్లు తెలిపారు. 12 రోజుల పాటు ట్రెక్కింగ్ చేసి ఎవరెస్ట్ శిఖరంపై జాతీయ పతాకాన్ని ఎగురవేసినట్లు రాములు తెలిపారు.

ఓటు వేసిన స్వాతంత్ర్య సమరయోధుడు

ఓటు వేస్తున్న స్వాతంత్ర్య సమరయోధుడు జుగ్గె శివదాస్

ఆర్మూర్‌టౌన్, మే3: పట్టణానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు ధోండి జుగ్గె శివదాస్ శుక్రవారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తన ఓటు హక్కును ఆయన స్వగృహంలో వినియోగించుకున్నారు. ఆయన మాట్లాడుతూ తనలాంటి వయోవృద్ధులకు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకోనేలా చర్యలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రాజేశ్వర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

బోధన్, మే 3: ఇటీవల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బుద్దె రాజేశ్వర్ మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను సాలూర మండల కేంద్రంలో శుక్రవారం కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పరామర్శించారు. బుద్దె రాజేశ్వర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇల్తెపు శంకర్, బోధన్ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సాలూర షకీల్, స్థానిక నాయకులు ఇల్తెపు గంగారాం, రమేశ్ ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 12 మందిపై కేసు

- ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష

వినాయక్‌నగర్, మే 3 : జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 12 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ వారికి కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం వాహనదారులను మార్నింగ్ కోర్టులో శుక్రవారం హాజరుపర్చారు. 11 మంది వాహనదారులకు రూ.12,800 జరిమానా, మరోవ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తున్నట్లు నిజామాబాద్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ తీర్పు చెప్పారని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు.

ప్రభుత్వ దవాఖానలో బంగారు గొలుసు చోరీ

వినాయక్‌నగర్, మే 3 : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ఓ పేషెంట్ వద్ద అటెండెంట్‌గా ఉన్న మహిళ పర్సులో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు బంగారు గొలుసును చోరీ చేశారు. ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ మండల పరిధిలోని ఇస్సాపల్లికి చెందిన గర్భిణి మూడు రోజుల క్రితం ప్రభుత్వ దవాఖానలో చికిత్స కోసం చేరింది. గర్భిణి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును ఆమె అత్తమ్మ గంగామణి పర్సులో ఉంచింది. గురువారం రాత్రి వార్డులో గంగామణి నిద్రించగా.. ఆమె పర్సును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. గర్భిణి భర్త నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

సంక్షిప్తంగా..

- **శివనామ సప్తాహం ప్రారంభం** - కోటగిరి, మే 3 : ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో నడవాలని సుంకిని సిద్ధ లింగప్ప మహరాజ్ అన్నారు. పొతంగల్ మండలం హెగ్డోలిలో 18వ అఖండ శివనామ సప్తాహం శుక్రవారం ప్రారంభమైంది. భక్తులు పాల్గొని పారాయణం, భజనలు, కీర్తనలు చేశారు.
- **ప్రకృతి పరిరక్షణ హోమం** - సుభాష్‌నగర్, మే 3 : వనమూలికలతో హోమం చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణ ఏర్పడి లోక కల్యాణం జరుగుతుందని ప్రముఖ వేద పండితుడు వేదమిత్ర ఆర్య అన్నారు. అంతర్జాతీయ అగ్నిహోత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్య సమాజ్ భవనంలో 11 హోమ కుండలాలతో శుక్రవారం యజ్ఞం నిర్వహించారు.
- **పోలింగ్‌స్టేషన్ అధికారుల వివరాల ప్రదర్శన** - ధర్పల్లి, మే 3 : మండలంలోని అన్ని పోలింగ్‌స్టేషన్ల వద్ద పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది వివరాలను ప్రదర్శిస్తున్నట్లు తహసీల్దార్ మాలతి, ఆర్ఐ రవి తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవల్ అధికారులు, పోలింగ్‌స్టేషన్ అధికారులు, సెక్టార్ అధికారి, రిటర్నింగ్ అధికారి ఫోన్ నంబర్లు, సెంట్రల్ రూమ్ కాంటాక్ట్ నంబర్‌తో కూడిన వివరాల గోడప్రతులను అతికించినట్లు తెలిపారు.
- **అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద అప్రమత్తంగా ఉండాలి** - కోటగిరి, మే 3 : అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద అప్రమత్తంగా ఉండాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. పొతంగల్ చెక్‌పోస్టు వద్ద ఎస్ఎస్‌టీ బృందంతో కలిసి శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయన వెంట బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రుద్రూర్ సీఐ జయేశ్‌రెడ్డి, ఎస్ఎస్‌టీ బృందం అధికారి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.